క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ


విద్యార్థులకు అట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : ఈదటం గ్రామంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసుకోవడానికి ఉపయోగపడే అట్టలను పంపిణీ చేశారు. దాన ధర్మ చారిటబుల్ ఆధ్వర్యంలో 32 మంది విద్యార్థులకు అట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్టు సభ్యులు నీలాపు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి దాతల సహకారం


గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేట గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి గ్రామానికి చెందిన కనిశెట్టి సూరి అప్పారావు కుమారుడు శ్రీనివాసరావు–ధనలక్ష్మి దంపతులు సోమవారం రూ.10,116 విరాళం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరుతున్నారు.

పెరిగిన ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి


నిర్మానుష్యంగా కోటవురట్ల మెయిన్‌రోడ్డు

కోటవురట్ల : ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెల్లవారు జామున మంచు కమ్ముకుంటున్నా ఉదయం 10 గంటల నుంచి సూరీడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమికి తాళలేక ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. సూరీడు దాటికి రహదారులు ఖాళీ అవుతున్నాయి. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతుండడంతో మండలంలోని పలు గ్రామాల నుంచి నర్సీపట్నం వెళుతున్న విద్యార్థులకు ఎండ తీవ్రతతో ఇబ్బందులు తప్పడం లేదు.

తిమ్మరాజుపేటలో పశువుల పాక సామగ్రి దగ్ధం


దగ్ధమైన పశువుల పాక సామగ్రి

మునగపాక : తిమ్మరాజుపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పశువుల పాక సామగ్రి దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. తిమ్మరాజుపేటకు చెందిన రైతు ఆదారి ఆదిబాబు పశువుల పాక నిర్మించుకుని అవసరమయ్యే కమ్మలు, చెక్కలు, ఎండుగడ్డి కుప్పను నిల్వ చేసుకోగా, ప్రమాదవశాత్తూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌కు గురై సామగ్రి అంతా అగ్నికి ఆహుతైంది. ఇది గమనించిన స్థానిక రైతులు మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదం కారణంగా రూ.35వేలకు పైగా నష్టం జరిగిందని, తనకు న్యాయం జరిగేలా చూడాలని రైతు ఆదిబాబు అధికారులను కోరారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

మునగపాక : మండలంలోని వెంకటాపురంలో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై పి.ప్రసాదరావు తెలిపారు. గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్ముతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాదరావు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు.

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా జానకి

మునగపాక: మండలంలోని మంగళవరపుపేటకు చెందిన ఆడారి జానకి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు.ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు నుంచి సోమవారం ఉత్తర్వులు అందాయి.

అంబరాన్నంటిన ఆసరా సంబరాలు

- నాలుగేళ్లలో రూ.42 కోట్లు రుణమాఫీ
- చంద్రబాబు వస్తే ఈ పథకాలన్నీ ఆగిపోతాయి
- రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు


డ్వాక్రా రుణమాఫీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు బాబూరావు, జోగులు


బహిరంగ సభకు భారీగా తరలి వచ్చిన మహిళలు

నక్కపల్లి: ఎన్నికల ముందు జగనన్న ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు రుణమాఫీ అమలు చేశారని, నక్కపల్లి మండలంలో నాలుగేళ్లలో రూ.40 కోట్లు రుణమాఫీ చేశారని రాజ్యసభ సభ్యుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆసరా సంబరాలు జరిగాయి. ఈ సంబరాల కార్యక్రమానికి మండలంలో వేలాది మంది డ్వాక్రా అక్క చెల్లెమ్మలు తరలివచ్చారు. ఈ సందర్భంగా సీఎం ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలంతా క్షీరాభిషేకం చేసారు.డ్వాక్రా సంఘాలకు జగనన్న ప్రభుత్వం మాఫీ చేసిన డ్వాక్రా రుణ మాఫీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో బాబూరావు,జోగులు మాట్లాడుతూ మండలంలో మొత్తం 2256 డ్వాక్రా సంఘాలు ఉన్నాయన్నారు. వీటిలో 24 వేలమంది సభ్యులుగా ఉన్నారన్నారు. 2019లో జగనన్న అధికారంలోకి వచ్చే నాటికి డ్వాక్రా అక్క చెల్లెమ్మలు తీసుకున్న అప్పు తీరుస్తానని నవరత్నాల పథకాల్లో జగనన్న ప్రకటించడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 2020–21 ఏడాది 1612 సంఘాలకు రూ.10.4 కోట్లు, 2021–22లో 1613 సంఘాలకు రూ.10.48 కోట్లు,2022–23లో 1618 సంఘాలకు రూ.10.91 కోట్లు, 2023–24లో 1618 సంఘాలకు10.48 కోట్లు చొప్పున నాలుగేళ్లలో రూ.42.34 కోట్లు రుణమాఫీ చేసి ఈ నగదును అక్క చెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. కరోనా సంక్షోభ సమయంలోనూ సంక్షేమ పథకాలను నిరాటంకంగా కొనసాగించిన ఘనత మన ప్రభుత్వానిదేనన్నారు. గత ఎన్నికల ముందు చంద్రబాబు మహిళలకు పసుపు కుంకుమ నిధులు ఇచ్చాడని, అప్పు తానే చెల్లిస్తానని చెప్పి చెల్లించకపోతే మహిళలంతా ఆర్థిక ఇబ్బందులు పడి డ్వాక్రాసంఘాలు తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగనన్న అలాంటి మోసం చేయలేదన్నారు. మళ్లీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడం కోసం మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అమ్మఒడి రాదని, రైతు భరోసా రాదని, పింఛన్లు కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద మళ్లీ పడిగాపులు పడాల్సి వస్తుందని, విద్యాదీవెన, విద్యావసతి, వంటి పథకాలకు మంగళం పాడేస్తాడని అన్నారు. వలంటీర్లను తొలగించి, సచివాలయ వ్యవస్థను రద్దు చేస్తామని ఇప్పటికే పలు సందర్భాల్లో ప్రకటించారన్నారు. మళ్లీ జన్మభూమి కమిటీలు రాజ్యమేలుతాయన్నారు. వారి దోపిడీ మొదలవుతుందన్నారు. ఇంటివద్దకే వెళ్లి పథకాలు ఇచ్చే నాయకుడు జగనన్న కావాలో, లేదా దోపిడీ చేస్తూ ప్రతి చిన్న పనికి లంచాలు గుంజే జన్మభూమి కమిటీలు కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమయిందన్నారు. తాను మంచి చేస్తేనే నాకు ఓటు వేయాలని జగనన్న ధైర్యంగా చెబుతున్నాడన్నారు. నన్నుమూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, మీ దయతో రాజ్యసభ సభ్యుడిగా అవకాశం వచ్చిందని, కంబాల జోగులును కూడా ఆదరించి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే జగనన్న ముఖ్యమంత్రి అవుతారని బాబూరావు తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంట్లో కనీసం నాలుగు సంక్షేమ పథకాల వల్ల లబ్ధి కలిగిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామన్నారు. అభివృద్ధి విషయంలో ఏ చర్చకైనా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డి.వి. సూర్యనారాయణరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు,తాతారావు, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవిందు, వెలుగు కోఆర్డినేటర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం ఉష, పలువురు సర్పంచ్‌లు ,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి


ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న గొల్ల బాబూరావు

నక్కపల్లి : తాను రాజ్యసభ సభ్యునిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మొట్ట మొదటగా నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో ట్రామా కేర్‌సెంటరు ఏర్పాటు చేయిస్తానని స్థానిక ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నక్కపల్లి, కోటవురట్ల 30 పడకల ఆస్పత్రులను 50 పడకల స్థాయికి పెంచడంతో పాటు రూ.6 కోట్లు మంజూరు చేయించి అదనపు భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించామన్నారు. గతంలో అయితే వైద్యులే ఉండేవారు కాదన్నారు. ఈ ఆస్పత్రిలో గైనిక్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రీషియన్ వంటి వైద్యనిపుణులను నియమించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఈ ఆస్పత్రి పరిధిలో సుమారు 30 కిలోమీటర్ల జాతీయరహదారి ఉండడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు క్షతగాత్రులవుతున్నారన్నారు. అత్యవసర వైద్యం అందక మరణిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఎంపీ డాక్టర్ సత్యవతి ద్వారా ట్రామా కేర్ సెంటరు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాను ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాజ్యాంగబద్ధంగా ఈ విషయం ప్రస్తావించి ట్రామాకేర్ సెంటరు ఏర్పాటు చేయిస్తానన్నారు. అనంతరం ఆస్పత్రికి అవసరమైన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆయన కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త కంబాల జోగులు, కాపుకార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


రామును పరామర్శిస్తున్న సుకుమారవర్మ

రాంబిల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి అనకాపల్లిలో గల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ రేబాక రామును డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ 30 వేలు ఆర్థిక సాయం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ


లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు

నక్కపల్లి : ప్రతిపేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్న ఉద్దేశ్యంతో జగనన్న రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు అన్నారు. సోమవారం నక్కపల్లి మండలంలో జగనన్న ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కు కల్పించిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సుమారు 3 వేల మందికి ఇళ్లపట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వీరందరికి ఈ స్థలాలపై పూర్తి హక్కు కల్పించే ఉద్దేశ్యంతో రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియతో ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు పూర్తిహక్కు ఏర్పడిందన్నారు. క్రయ విక్రయాలకు అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఇళ్లు నిర్మించుకుని హాయిగా జీవించాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, తహసీల్దార్ శ్రీకాంత్, సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, సురేష్ వర్మ, పివెంకటేష్, వియ్యపు శ్రీను, ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, నానాజీ, ఈశ్వరరావు, బచ్చలరాజు, పార్టీ నాయకులు బొల్లం బాబ్జి, గొర్ల బాబూరావు, శ్రీవరలక్ష్మి, సూరాకాసుల గోవిందు, తాతబాబు ,శేషారత్నం పాల్గొన్నారు.

దళితవాడలను పంచాయతీలుగా గుర్తించాలి


దళితవాడలను పంచాయతీలుగా గుర్తించాలని ప్రచారం చేస్తున్న దృశ్యం

మునగపాక : దళితవాడలను పంచాయతీలుగా గుర్తించడం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని అంబేడ్కర్ ఇండియన్ మిషన్(ఏఐఎం) ఉదయం అధ్యక్షుడు బీల శివాజీ పేర్కొన్నారు. 800 ఓట్లు ఉన్న దళితవాడలను పంచాయతీలుగా అవకాశం కల్పించాలన్నారు. మునగపాక దళితవాడలో సోమవారం ఆయన ఇంటింటా ప్రచారంతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా తీర్చిదిద్దడం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దళితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఏపీ డీజీపీ పి.వి.సునీల్‌కుమార్ సూచనల మేరకు దళితవాడల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐఎం సభ్యులు ఎం.మహేష్, సీతారాములు, అనిల్ శేఖర్, హర్ష మహేష్, గణేష్, శివకుమార్, సుశాంత్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో పనులు చురుగ్గా చేయాలి

పాయకరావుపేట : గ్రామ సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చురుగ్గా చేయించాలని గ్రామ కార్యదర్శులను ఎంపీడీవో కెన్నెడీ ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశమయ్యారు జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు త్వరగా చేయించాలని, ఇంటి పన్నులు వసూలు పూర్తి స్థాయిలో చేపట్టాలని, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు అందరికీ పంపిణీ చేసి ఈకేవైసీ చేయించాలని సూచించారు. సమావేశంలో ఈవోఆర్డీ చంద్రశేఖర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కనుల పండువలా భావనారుషి భద్రావతీదేవి కల్యాణం


భావనారుషికి హారతులిస్తున్న భక్తులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ ధర్మవరంలో భావనారుషి భద్రావతీదేవి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కనుల పండువగా జరిగింది. పట్టణంలో ఉన్న పద్మశాలీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవానికి యలమంచిలి పట్టణం, మండలం, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి భావనారుషి ఆలయం వద్ద జరుగుతున్న ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగస్వామ్యులయ్యారు. భావనారుషి భద్రావతీదేవి విగ్రహాలను పల్లకీలో భక్తి గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో యలమంచిలి పట్టణ పురవీధుల్లో భక్తులు ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శివాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన


శివాలయం పునర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు

ఎస్.రాయవరం: గ్రామంల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెరిగితే ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని రాజ్యసభ సభ్యులు , పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త,రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు.పెంగరాజుపాలెం గ్రామంలో శివాలయం పునర్నిర్మాణానికి కోటి రూపాయలతో పనులు చేపట్టేందుకు సోమవారం ఎమ్మెల్యేలు ఇరువురు శంకుస్థాపన చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.80 లక్షలు, స్థానిక విరాళాలతో రూ.20 లక్షలు కేటాయించి ఈ ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. దేవదాయశాఖలో శిథిలావస్థకు చేరుకున్న మరిన్ని దేవాలయాలు పునర్ నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీపతిరాజు, కర్రి శ్రీను, జేసీఎస్ కన్వీనర్ సందీప్, మాజీ జెడ్పీటీసీ కొంకోటి రమణ పాల్గొన్నారు.

కొత్త పింఛన్లను అందజేయాలి


ఈవోఆర్డీ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న చక్రవర్తి

రాంబిల్లి: మండలంలోని జడ్.చింతువ పంచాయతీకి చెందిన కొత్త పెన్షన్ లబ్ధిదారులకు పెన్షన్లు అందజేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి ఎరిపల్లి చక్రవర్తి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఈవోపీఆర్డీ రాజుకు వినతిపత్రం అందజేశారు. 38 మందికి కొత్తగా పెన్షన్ మంజూరైందని అందులో కొంత మందికి పెన్షన్లు పంపిణీ చేయలేదని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవాలకు ముస్తాబైన అభయాంజనేయ స్వామి


ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న విద్యుదలంకరణ

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు జంక్షన్ లో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటఉరట్ల మండలాలకు చెందిన వారు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే జంక్షన్‌లో స్వామి వార్షికోత్సవం ప్రతిఏటా జరపడం ఆన వాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా నాలుగు రోడ్డు కూడలిలో విద్యుదలంకరణతో అందంగా తీర్చిదిద్దారు.

వైఎస్సార్ ఆసరా మహిళలకు వరం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు జగన్

మునగపాక : వైఎస్సార్ ఆసరాతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్ తెలిపారు. తిమ్మరాజుపేట రామాలయం ప్రాంగణంలో సోమవారం రాత్రి డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా మహిళలకు వరంగా మారిందన్నారు. ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతిగా నిలిచారన్నారు. సమావేశంలో సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఎంపీటీసీ కరణం అప్పలనరసమ్మ, మాజీ సర్పంచ్ కరణం జగన్నాథరావు,పార్టీ నేతలు ఆడారి వెంకట గణేష్, కరణం రామభద్రయ్యడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా


అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడిన లారీ

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు నుంచి యలమంచిలి వైపు వెళుతున్న లారీ గోకులపాడు సమీపంలో సోమవారం అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. జిప్సమ్ లోడుతో వెళుతున్న లారీ రోడ్డుకి అడ్డంగా పడటంతో కాసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. స్థానిక పోలీసులు వాహనాన్ని అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

నక్కపల్లిలో శూలాల సంబరం


శూలాల సంబరంలో నేలవేషాలు

నక్కపల్లి: మండల కేంద్రంలో శూలాల సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భద్రావతి సమేత భావనరుషి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నుంచి నక్కపల్లిలో నేలవేషాలు ప్రభల ఊరేగింపు, నిర్వహించారు. యువత దాస్యులతో సందడి చేశారు. ఆలయం వద్ద పూజారి పత్రి పూజ నిర్వహించారు. పత్రి తెచ్చే సమయంలో భక్తులపై నీళ్ల బిందెలు కుమ్మరించి ఊరేగింపు నిర్వహించారు. రాత్రికి శూలాల సంబరం జరుగుతుందని తెల్లవార్లు భక్తులు నాలుకపై శూలాలు గుచ్చుకుని సంబరం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అధికారులు


పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా మండలంలో గల ఎన్నికల పోలింగ్ బూత్‌లను అధికారులు సోమవారం పరిశీలించినట్లు మండల తహసీల్దార్ జేఎస్ సూర్యనారాయణ తెలిపారు. పట్టణంలో గల పోలింగ్ బూత్‌లను, మండలంలో గల ఆయా గ్రామాల్లో గల 30 పోలింగ్ బూత్‌లను పరిశీలించినట్లు తెలిపారు. తహసీల్దార్ సూర్యనారాయణతో పాటు సీఐ పి.అప్పలరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ సత్యనారాయణ ఉన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

పాయకరావుపేట : శ్రీరాంపురం గ్రామం నుంచి కేశవరం గ్రామం వైపు అక్రమంగా 13 మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జోగారావు తెలిపారు. రాజవరం గ్రామం వద్ద 10 లీటర్లు నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని, సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జోగారావు తెలిపారు. వీరిద్దరిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

48 మద్యం సీసాలు పట్టివేత


పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్సై రమణయ్య

కోటవురట్ల : ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్సై రమణయ్య తెలిపిన వివరాలివి. విశ్వసనీయ సమాచారం మేరకు బి.కె.పల్లి గ్రామంలోని లావేటి వరలక్ష్మి ఇంటిపై దాడి చేయగా 48 మద్యం సీసాలు పట్టుబడినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.7,344 చేస్తుందని, సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం విక్రయించినా, నాటుసారా తయారు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినూత్న నిరసన


సచివాలయం వద్ద గేదెలు

రాంబిల్లి: పెదకలవలాపల్లిలో సోమవారం రైతులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. నేవీ ప్రహరీ గోడ నిర్మాణ పనుల్లో భాగంగా తమ పశువుల పాకల చుట్టూ గోతులు తవ్వి పశువులు కట్టుకునేందుకు అవకాశం లేకుండా చేశారంటూ వారి గేదెలను సచివాలయం వద్దకు తరలించి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.